# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 08-09-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ భారత్‌ను ప్రపంచ వ్యాపార కేంద్రంగా మార్చాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పిలుపునిచ్చారు.
- ❖ భారత ఉప రాష్ట్రపతి ఎన్నిక రేపు జరగనుంది.
- ❖ ప్రపంచ ఆర్థిక స్థిరత్వానికి బ్రిక్స్ కూటమి పని చేయనుందని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ పేర్కొన్నారు.
- ❖ జీఎస్టీ సంస్కరణల ఫలితాలు ప్రతీ ఒక్క వినియోగదారునికి చేరాలని కేంద్రమంత్రి పియూష్ గోయల్ ఆకాంక్షించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత్‌ను ప్రపంచ వ్యాపార కేంద్రంగాను జ్ఞాన కేంద్రంగాను మార్చాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పిలుపునిచ్చారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన ఇంజనీరింగ్ ఎక్స్‌పోర్ట్స్ ప్రమోషన్ కౌన్సిల్ (EEPC) వజ్రోత్సవ వేడుకల్లో రాష్ట్రపతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భారత ఆర్థిక వ్యవస్థ మరింత స్వావలంబన చెందాల్సి ఉందన్నారు. అలాగే ఎగుమతులలోను రాణించాల్సిన అవసరం ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు. COVID సమయంలో ఆత్మనిర్భర్ భారత్‌కు వేసిన పునాదులు మంచి ఫలితాలను ఇస్తున్నాయని చెప్పారు. ఆత్మ నిర్భర్ భారత్ ద్వారా ప్రపంచ ఆర్థిక అస్థిరత ప్రభావం జాతీయ ఆర్థిక వ్యవస్థపై తక్కువగా ఉంటుందని రాష్ట్రపతి వ్యాఖ్యానించారు.

(వాయిస్ 33 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత ఉప రాష్ట్రపతి ఎన్నిక రేపు జరగనుంది. ఈ ఎన్నికలో NDA కూటమి అభ్యర్థిగా సి.పి. రాధాకృష్ణన్, ఇండి కూటమి అభ్యర్థిగా బి.సుదర్శన్ రెడ్డి పోటీలో ఉన్నారు. లోకసభలో 542 మంది సభ్యులు, రాజ్యసభలో 239 మంది సభ్యులు కలిపి ఉప రాష్ట్రపతి ఎన్నికకు మొత్తం 781 మంది పార్లమెంట్ సభ్యులు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఈ ఎన్నికలో విజయానికి అభ్యర్థికి 391 ఓట్లు రావలసి ఉంటుంది. ఈ సంవత్సరం జులైలో జగదీప్ ధన్‌ఖర్ అనారోగ్య కారణాలతో ఉప రాష్ట్రపతి పదవికి రాజీనామా చేయడంతో ఈ ఎన్నిక అనివార్యమైంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రపంచ ఆర్థిక స్థిరత్వానికి బ్రిక్స్ కూటమి పని చేయనుందని భారత విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ పేర్కొన్నారు. ఈరోజు ఆయన బ్రిక్స్ వర్చువల్ సదస్సులో భారత్ తరుపున పాల్గొని ప్రసంగించారు. స్థిరమైన వాణిజ్యాన్ని ప్రోత్సహించడానికి నిర్మాణాత్మక, సహకార విధానాలు అవసరమన్నారు. ప్రపంచ ఆర్థిక చర్చలో వాణిజ్య విధానాలు, మార్కెట్ లభ్యత ప్రస్తుతం కీలక సమస్యలని వ్యాఖ్యానించారు. అడ్డంకులను పెంచడం, లావాదేవీలను క్లిష్టతరం చేయడం సరికాదని, అలాగే వాణిజ్య చర్యలను వాణిజ్యేతర విషయాలకు అనుసంధానించడం కూడా సరైన విధానం కాదని జైశంకర్ వివరిస్తూ…

(వాయిస్ 34 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

యువతకు ఉపాధి కల్పన, నైపుణ్యాభివృద్ధి లక్ష్యంగా కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ ఒక ప్రైవేటు సంస్థతో అవగాహనా ఒప్పందం కుదుర్చుకుంది. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన కార్యక్రమంలో ఆ శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవియ సమక్షంలో ఈ అవగాహన ఒప్పందంపై ఇరు పక్షాల ప్రతినిధులు సంతకాలు చేశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ… స్వావలంబన భారత్‌కు ఉపాధి కల్పన కీలకమని పేర్కొన్నారు. ప్రైవేటు భాగస్వామ్యం సహకారంతో విస్తృత ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని, వ్యవసాయం, సేవా రంగం, మౌలిక సదుపాయాలు వంటి కీలక రంగాలు అభివృద్ధి చెంది, తద్వారా దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తాయని వివరించారు. ఉపాధి కల్పనలో నేషనల్ కెరీర్ సర్వీస్ పోర్టల్ కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొంటూ.. పోర్టల్‌లో 28 వేల అంతర్జాతీయ ఉద్యోగాలతో సహా 51 లక్షలకు పైగా రిజిస్ట్రేషన్లు, 46 లక్షల ఖాళీలు పొందుపరిచి ఉన్నాయని మన్సుఖ్ మాండవియ వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఇటీవల వరదల ప్రభావంతో పంజాబ్‌లో జరిగిన నష్టాన్ని రాష్ట్ర ప్రభుత్వంతో పాటు, కేంద్ర బృందాలు అంచనా వేస్తున్నాయని రైల్వే శాఖ సహాయ మంత్రి రవ్‌నీత్ సింగ్ బిట్టు తెలిపారు. పంజాబ్ ప్రభుత్వం నష్ట నివేదికను అందజేసిన తరువాత కేంద్ర ప్రభుత్వం నిధులను విడుదల చేస్తుందని ఆయన పేర్కొన్నారు. వరదల కారణంగా పంజాబ్‌లో ఇప్పటివరకు 48 మంది మరణించగా.. 2,050 గ్రామాలకు చెందిన 3 లక్షల 87 వేల మంది నిరాశ్రయులయ్యారు. భారత సైన్యం, BSF, NDRF నిపుణుల బృందాలు, స్వచ్ఛంద సంస్థలు, వరద ప్రభావిత ప్రాంతాల్లో యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు కొనసాగిస్తున్నాయి. ఇదిలా ఉండగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పంజాబ్‌లోని వరద ప్రభావిత ప్రాంతాల్లో రేపు పర్యటించి అధికారులతో సమీక్ష నిర్వహించున్నారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశీ ఉత్పత్తుల వ్యాపారాలు అభివృద్ధి చెందాలని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖా మంత్రి పియూష్ గోయల్ ఆకాంక్షించారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన 56వ ఇంజనీరింగ్ ఎక్స్‌పోర్ట్స్ ప్రమోషన్ కౌన్సిల్ (EEPC) ఇండియా జాతీయ అవార్డుల కార్యక్రమంలో కేంద్రమంత్రి పాల్గొని ప్రసంగిస్తూ… స్వదేశీ ఉత్పత్తుల వ్యాపారాలు దేశ అభివృద్ధికి దోహదపడతాయని, అలాగే దేశ ఆర్థిక భద్రతను బలోపేతం చేస్తాయన్నారు. ఇటీవల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్వదేశీ ఉత్పత్తులు వినియోగించాలని స్పష్టమైన పిలుపునిచ్చారని గుర్తు చేస్తూ.. దేశంలోని 140 కోట్ల మంది ప్రజలు, వ్యాపారవేత్తలు మేడ్ ఇన్ ఇండియా ఉత్పత్తులపై దృష్టి పెట్టాలని విజ్ఞప్తి చేశారు. సరళీకృతం చేసిన GST సంస్కరణల ఫలితాలు ప్రతి ఒక్క వినియోగదారునికి అందాలని పియూష్ గోయల్ పేర్కొంటూ…

(వాయిస్ 31 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రతికూల వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో జమ్మూ కాశ్మీర్ లో శ్రీ మాతా వైష్ణోదేవి యాత్రను వరుసగా 14వ రోజు నిలిపివేశారు. ఆ ప్రాంతంలో కొండ చరియలు విరిగి పడడంతో రహదారులు మూసుకుపోతున్నాయని స్థానిక అధికారులు తెలిపారు. ఈ సమయంలో యాత్రికుల రాకపోకలు సురక్షితం కాదని, దీంతో యాత్రను నిలిపివేశామని పేర్కొన్నారు. రహదారులపై కొండ చరియల తొలగింపు పనులు జరుగుతున్నాయని, వాతావరణ పరిస్థితులు మెరుగుపడి, రహదారులు యాత్రకు అనుకూలంగా ఉన్నట్లు నిర్ధారణ జరిగిన తరువాత యాత్ర తిరిగి ప్రారంభం అవుతుందని అధికారులు వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

బీహార్‌లో.. సవరించిన ఓటర్ల జాబితాలో చేర్చడానికి ఆధార్ కార్డును గుర్తింపు రుజువుగా అనుమతించాలని సుప్రీంకోర్టు ఈరోజు ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. దీని ప్రకారం ఓటర్ల జాబితాలో పేరు చేర్చడానికి ఆధార్ కార్డును స్వతంత్ర పత్రంగా సమర్పించవచ్చు. ఓటర్ల జాబితాలో చేర్చడానికి ఎన్నికల సంఘం అధికారులు ఆధార్ కార్డును స్వతంత్ర పత్రంగా అంగీకరించడం లేదని పలు రాజకీయ పార్టీలు పిటిషన్లు దాఖలు చేసిన నేపథ్యంలో జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చిలతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశ శాస్త్రీయ పురోగతిలో మానవ వనరుల సామర్థ్య నిర్మాణం కీలకమైన అంశమని కేంద్ర శాస్త్ర సాంకేతికత శాఖా మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ రూపొందించిన.. సైన్స్ అడ్మినిస్ట్రేటర్ల కోసం ఒక వారం రెసిడెన్షియల్ అడ్మినిస్ట్రేటివ్ శిక్షణా కార్యక్రమాన్ని ఆయన ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సైన్స్ అడ్మినిస్ట్రేటర్లు మేనేజర్లుగా మాత్రమే కాక వికసిత్ భారత్ కోసం భవిష్యత్ నాయకులుగా తీర్చిదిద్దేలా మాడ్యూల్‌లో కమ్యూనికేషన్ నైపుణ్యాలు, పరిశ్రమ దృక్పథాలను చేర్చాలని సూచించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు స్వల్ప లాభాలతో ముగిశాయి. ఉదయం సెన్సెక్స్ 80,710 పాయింట్ల వద్ద ప్రారంభమై... చివరకు 77 పాయింట్లు లాభపడి 80,787 వద్ద స్థిర పడింది.  నిఫ్టీ 32 పాయింట్ల లాభంతో 24,773 వద్ద ముగిసింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 88.27గా ఉంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

అల్ప పీడన ప్రభావంతో రానున్న రెండు రోజుల్లో రాజస్థాన్ నైరుతి ప్రాంతంలోను, ఉత్తర గుజరాత్ లోను అతి భారీ వర్షాలు కురవచ్చని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) అధికారులు తెలిపారు. పశ్చిమ బెంగాల్, సిక్కింలలో అక్కడక్కడ భారీ వర్షాలు కురవచ్చని పేర్కొన్నారు. ఆ తరువాత రెండు రోజుల్లో అరుణాచల్ ప్రదేశ్, అస్సాం, మేఘాలయాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = =